

స్వర్ణాంధ్ర
యువ రథసారథికి
స్వాగతం..
సుస్వాగతం



స్వాగతం..సుస్వాగతం
కీ॥శే॥ శ్రీ జన్ని ముత్యాలు గారు
మాజీ ఎమ్మెల్యే, సాలూరు
శంఖారావంతో రాష్ట్రంలో
తెలుగుదేశం పార్టీని విజయఢంకా
మోగించి.. కూటమి గెలుపునకు
కృషి చేయడమే కాకుండా రాష్ట్ర
విద్యాశాఖామంత్రిగా బాధ్యతలు
స్వీకరించిన నాటి నుంచి విద్యావ్యవస్థలో
విప్లవాత్మకమైన మార్పులకు
శ్రీకారం చుట్టడమే కాకుండా
రాష్ట్ర చరిత్రలో 10వ తరగతి,
ఇంటర్మీడియట్ ఫలితాల్లో
పార్వతీపురం మన్యం జిల్లా ప్రథమ స్థానంలో నిలిచేటట్టు చేసి
కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత జిల్లాకు
మొట్ట మొదటిసారిగా విచ్చేస్తున్న
రాష్ట్ర విద్యాశాఖా మంత్రి
గౌ॥ శ్రీ నారా లోకేష్ గారికి
స్వాగతం..
సుస్వాగతం
శ్రీ నారా లోకేష్ గారు
ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర మానవ వనరులు, మరియు
ఐ.టి. & విద్యా శాఖామంత్రివర్యులు
జాతీయ తెలుగుదేశం పార్టీ ప్రధాన కార్యదర్శి
శ్రీమతి గుమ్మిడి సంధ్యారాణి
ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర స్త్రీ, శిశు మరియు
గిరిజన సంక్షేమ శాఖా మంత్రివర్యులు

మంత్రి లోకేశ్ పర్యటన ఏర్పాట్ల పరిశీలన

పార్వతీపురం, జూన్ 8 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర మంత్రి నారా లోకేష్ సోమవారం పార్వతీపురంలో పర్యటించనున్న నేపథ్యంలో సంబంధిత ఏర్పాట్లను ఎమ్మెల్యే బోనెల విజయచంద్ర ఆదివారం పరిశీలించారు. పార్వతీపురంలోని రాయల్ కన్వెన్షన్ హాల్‌తో పాటు చినబొండపల్లి వద్ద సభా వేదిక పనులను పర్యవేక్షించారు. ఈ సందర్భంగా పలు సూచనలిచ్చారు. ట్రాఫిక్‌కు ఎటువంటి ఇబ్బందులు లేకుండా చూడాలని తెలిపారు. మంత్రి పర్యటన విజయవంతం చేయాలని పార్టీ శ్రేణులకు పిలుపునిచ్చారు. ఆయన వెంట మంత్రి లోకేశ్ పర్యటన పర్యవేక్షకుడు రవినాయుడు తదితరులు పాల్గొన్నారు.


సభ వేదిక ఏర్పాట్లను పర్యవేక్షిస్తున్న ఎమ్మెల్యే తదితరులు

సందడిగా ప్రభుత్వ పాఠశాల వజ్రోత్సవం



వీరఘట్టంలో ర్యాలీ నిర్వహిస్తున్న పూర్వ విద్యార్థులు

వీరఘట్టం, జూన్ 8 (ఆంధ్రజ్యోతి): వీరఘట్టం జడ్పీ ఉన్నత పాఠశాల వజ్రోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఆదివారం నిర్వహించిన ఈ వేడుకలకు సుమారు 2,500 మంది పూర్వ విద్యార్థులు హాజరయ్యారు. ఒక్కో బ్యాచ్‌కు చెందిన వారు ఒక్కో రకమైన దుస్తులు, టోపీలు ధరించి ర్యాలీ నిర్వహిస్తూ వేదిక వద్దకు చేరుకున్నారు. ఎన్నో సంవత్సరాల తర్వాత కలుసుకున్న విద్యార్థులు ఆప్యాయంగా ఒకరినొకరు పలకరించుకున్నారు. నాటి జ్ఞాపకాలను గుర్తు చేసుకున్నారు. పక్క రాష్ట్రాల నుంచే కాకుండా ఇతర దేశాల్లో స్థిరపడిన వారంతా కుటుంబాలతో వజ్రోత్సవానికి హాజరయ్యారు. ఈ సందర్భంగా పాఠశాలకు స్థలం దానం చేసిన రౌతు చిన్నమనాయుడు విగ్రహాన్ని , పాఠశాల ఆవరణలో కోడి రామ్మూర్తినాయుడు విగ్రహాన్ని ఆవిష్కరించారు. నాటి ఉపాధ్యాయులను ఘనంగా సత్కరించి వారి ఆశీస్సులు తీసుకున్నారు. ఈ కార్య క్రమానికి ఎమ్మెల్యే నిమ్మక జయకృష్ణ, ఎమ్మెల్సీ పాలవలస విక్రాంత్ కూడా పాల్గొన్నారు. కమిటీ సభ్యులు ఎటువంటి అసౌకర్యం కలగకుండా ఏర్పాట్లు చేశారు. ఎస్ఐ జి.కళానిధి, ఏఎస్ఐ కృష్ణమూర్తి ఆధ్వర్యంలో పోలీసులు బందోబస్తు ఏర్పాటు చేసి ట్రాఫిక్‌ను కంట్రోల్ చేశారు.

గ్రావెల్ అక్రమ రవాణా


ట్రాక్టర్‌తో గ్రావెల్‌ను తరలిస్తున్న దృశ్యం

బొబ్బిలి రూరల్, జూన్ 8(ఆంధ్రజ్యోతి): గ్రోత్ సెంటర్‌కు సమీపంలో ఉన్న నారాయణప్పవలస, మల్లమ్మపేట తదితర గ్రామాల్లోని చెరువుల నుంచి గ్రావెల్‌ను ట్రాక్టర్లలో అక్రమంగా తరలిస్తున్నారు. ఈ గ్రావెల్‌ను ఏపీఐఐసీ పారిశ్రామికవాడలో మూతపడిన ఓ పరిశ్రమ ఆవరణలో నిల్వ చేస్తున్నారు. ఇప్పటివరకు దాదాపు 500 లోడ్లను నిల్వ చేశారు. ఎవరికైనా అవసరమైనప్పుడు, మంచి బేరం కుదిరినప్పుడు ప్రభుత్వ సెలవు దినాల్లో గ్రావెల్‌ను తరలించి సొమ్ము చేసుకుంటున్నారు. ఎమ్మెల్యే పేరు చెప్పి ఈ దందా సాగిస్తున్నట్టు ఆరోపణలు ఉన్నాయి. దీనిపై తహసీల్దార్ ఎం.శ్రీనును వివరణ కోరగా.. 'గ్రావెల్ అక్రమ రవాణాను అడ్డుకోవాలని ఇప్పటికే సిబ్బందికి ఆదేశాలిచ్చాం. యంత్రాలను సీజ్ చేస్తాం' అని తెలిపారు.

ఎమ్మెల్యేపై అనుచిత వ్యాఖ్యలు.. పోలీసుల అదుపులో నిందితుడు


మాట్లాడుతున్న సీఐ చంద్రమౌళి

పాలకొండ, జూన్ 8 (ఆంధ్రజ్యోతి): పాలకొండ ఎమ్మెల్యే నిమ్మక జయకృష్ణపై ఇన్‌స్టాగ్రామ్ వేదికగా అనుచిత వ్యాఖ్యలు చేసిన వ్యక్తిని పోలీసులు ఆదివారం అదుపులోకి తీసుకున్నారు. ఆదివారం స్థానిక పోలీస్‌స్టేషన్‌లో నిర్వహించిన విలేకరుల సమావేశంలో సీఐ చంద్రమౌళి ఆ వివారాలను వెల్లడించారు. సోషల్ మీడియా వేదికగా పాలకొండ ఎమ్మెల్యే నిమ్మక జయకృష్ణపై అనుచిత వ్యాఖ్యలు చేసిన బామిని మండలం సొలికిరి గ్రామానికి చెందిన జామి వెంకటేశ్‌ను అదుపులోకి తీసుకున్నామన్నారు. వెంకటేశ్ కారు డ్రైవర్‌గా పనిచేస్తున్నాడన్నారు. తన స్నేహితుడు పోస్టు చేసిన పాలకొండ ఎమ్మెల్యే నిమ్మక జయకృష్ణ వీడియోకు వెంకటేశ్ అమానుష రీతిలో కామెంట్ చేశాడని ఉమ్మడి శ్రీకాకుళం జిల్లా సంయుక్త కార్యదర్శి వజ్రగడ రవికుమార్ ఈనెల 2న ఫిర్యాదు చేశారన్నారు. దాంతో ఇన్‌స్టాగ్రామ్ అకౌంట్ ఆధారంగా నిందితుడి ఐపీ అడ్రస్ కనుగొన్నామన్నారు. కాల్ డేటాల ద్వారా విశాఖ పట్నంలోని పెందుర్తి ప్రాంతంలో అదుపులోకి తీసుకుని పాలకొండ పోలీస్‌స్టేషన్‌కు తీసుకువచ్చామన్నారు.

క్రీడాకారుల నిరసన



గరివిడిలో రాస్తారోకో నిర్వహిస్తున్న క్రీడాకారులు

గరివిడి, జూన్8 (ఆంధ్రజ్యోతి): గరివిడిలో ఫేకర్ యాజమాన్యం ఫుట్‌బాల్ గ్రౌండ్ విక్రయించడాన్ని నిరసిస్తూ క్రీడాకారులు ఆదివారం సాయంత్రం నిరసన చేపట్టారు. ముందుగా ఫుట్‌బాల్ గ్రౌండ్ నుంచి ర్యాలీగా గరివిడి సినిమాహాల్ సెంటర్‌కు చేరుకుని చీపురుపల్లి, గరివిడి ప్రధాన రహదారిపై రాస్తారోకో నిర్వహించారు. ఈ సందర్భంగా పలువురు క్రీడా కారులు మాట్లాడుతూ గత 60 సంవత్సరాలుగా స్థానిక ఫుట్‌బాల్ గ్రౌండ్‌లో ఆటలాడుకుంటూ జాతీయ స్థాయిలో క్రీడాకారులుగా ఎదిగారన్నారు. అలాగే గరివిడి వాసులకు వాకింగ్, క్రీడలు ఆడుకునేందుకు ఉన్న ఫుట్‌బాల్ గ్రౌండ్‌ను ఫేకర్ యాజమాన్యం అమ్మడం దారుణమన్నారు. ఇప్పటికైనా ప్రభుత్వ యంత్రాంగం స్పందించి గరివిడిలో ఫుట్‌బాల్ గ్రౌండ్‌ను కొనసాగించే ఏర్పాటు చేయాలని కోరారు.

మాతృ భాష బోధనను పునరుద్ధరించాలి

విజయనగరం బాబామెట్ట, జూన్8 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వం మాతృ విద్యాబోధనను పునరుద్ధరించాలని మానవ హక్కుల వేదిక జిల్లా కన్వీనరు బంకురు జోగినాయుడు డిమాండ్ చేశారు. ఆదివారం కోట జంక్షన్ సమీపంలోని వేదిక కార్యాలయంలో ఆయన మాట్లాడుతూ విద్యాశాఖ మంత్రి లోకేశ్ యువగళం పాదయాత్రలో గత ప్రభుత్వం ప్రవేశపెట్టిన 117 జీవోను రద్దు చేసి మాతృ విద్యాబోధనను పునరుద్ధరిస్తామని హామీ ఇచ్చినా నేటికీ అమలు కాలేదన్నారు. ఏకోపాధ్యాయ పాఠశాలల్లో మరో ఉపాధ్యాయుడిని నియమించాలని ఆయన డిమాండ్ చేశారు. ఫోటోరైటప్:

దేవునికణపాకలో కార్డెన్ సెర్చ్


రికార్డులు లేని వాహనాలు స్వాధీనం చేసుకున్న పోలీసులు

విజయనగరం క్రైం/ గుర్ల జూన్ 8 (ఆంధ్రజ్యోతి): ఎస్పీ వకుల్ జిందాల్ ఆదేశాలతో ఆదివారం గుర్ల మండలంలోని దేవునికణపాకలో పోలీసులు కార్డెన్ సెర్చ్ నిర్వహించారు. ఇళ్లల్లో సోదాలు చేపట్టారు. గ్రామ శివార్లలో సారా తయారీకి సిద్ధం చేసిన 400 లీటర్ల బెల్లపు ఊటను ధ్వంసం చేశారు. రికార్డులు సరిగ్గా లేని ఆరు మోటార్ సైకిళ్లను సీజ్ చేసి స్టేషన్‌కు తరలించారు. వేకువ జామున 5 గంటలకు చీపురుపల్లి సీఐ శంకరరావు ఆధ్వర్యంలో సర్కిల్ పోలీసు అధికారులు, సిబ్బంది విస్తృతంగా తనిఖీలు చేపట్టారు. ఆపరేషన్‌లో చీపురుపల్లి సీఐ రాఘవులు, ఎస్ఐలు శ్రీనివాస్,నారాయణరావు, లోకేశ్వరరావు, పాల్గొన్నారు.

డ్రోన్ సాయంతో మందుబాబులపై దాడి


మందుబాబులను పట్టుకున్నపోలీసులు

విజయనగరం క్రైం, జూన్ 8 (ఆంధ్రజ్యోతి): నగరంలోని టూటౌన్ పోలీసుస్టేషన్ పరిధిలోని శివారు బహిరంగ ప్రదేశాల్లో మద్యం సేవిస్తున్నట్టు ఆదివారం పోలీసులు డ్రోన్ సాయంతో గుర్తించారు. దాంతో వారిపై దాడులు నిర్వహించారు. మందుబాబులను అదుపులోకి తీసుకుని కేసులు నమోదు చేసినట్టు ఎస్పీ వకుల్ జిందాల్ తెలిపారు. విజయనగరం వన్ టౌన్, టూటౌన్‌కి వచ్చిన సమాచారం మేరకు పూల్‌బాగ్ కాలనీ, నందిగుడ్డి ప్రాంతం, కణపాక, అయ్యన్నపేట ప్రాంతాల్లో బహిరంగ ప్రదేశాల్లో డ్రోన్‌తో నిఘా పెట్టామన్నారు. మందుబాబులను గుర్తించి 11 మందిపై కేసులు నమోదు చేశామన్నారు. నేర నియంత్రణ, శివారు ప్రాంతా ల్లో అసాంఘిక కార్యకలాపాలు నియంత్రణకు డ్రోన్స్ వినియోగించాలని ఎస్పీ వకుల్ జిందాల్ పోలీసు అధికారులను ఆదేశించారు.

యోగాతో సంపూర్ణ ఆరోగ్యం


నగర పంచాయతీలో యోగా చేస్తున్న కమిషనర్ తదితరులు

పాలకొండ, జూన్ 8(ఆంధ్రజ్యోతి): శారీరక మానసిక ఉల్లాసానికి, సంపూర్ణ ఆరోగ్యానికి యోగా ఎంతగానో దోహదపడుతుందని నగర పంచాయతీ కమిషనర్ రత్నం రాజు తెలిపారు. ఆదివారం స్థానిక నగర పంచాయతీ కార్యాలయ ఆవరణలో యోగాంధ్ర కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా యోగా గురు జనార్దనరావు మాస్టార్ ఆధ్వర్యంలో సీనియర్ సిటిజన్లతో వివిధ ఆసనాలు వేయించారు. రోజూ యోగా చేయడం ఒక అలవాటుగా మార్చుకోవాలని కమిషనర్ సూచించారు. మానసిక, శారీరక రుగ్మతలను యోగాతో దూరం చేసుకోవచ్చని తెలిపారు. కార్యక్రమంలో సచివాలయ, నగర పంచాయతీ కార్యాలయ ఉద్యోగులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

గ్రంథాలయం పరిశీలన

సీతంపేట రూరల్, జూన్ 8(ఆంధ్రజ్యోతి):సీతంపేట గ్రంథాలయ శాఖను ఆదివారం గ్రంథాలయ కార్యదర్శి వీవీజీ శంకరరావు సందర్శించారు. రికార్డులను పరిశీలించి, కాంపిటేటివ్ బుక్స్ ఎన్ని అందుబాటులో ఉన్నాయో గ్రంథాలయా ధికారి బి.గణేష్‌ను అడిగి తెలుసుకున్నారు. గ్రంథాలయానికి రహదారి సమస్య ఉందని, ఈ విషయాన్ని ఐటీడీఏ ఇన్‌చార్జి పీవోకు తెలియజేశామని గణేష్ తెలి పారు. ప్రవేశ ద్వారం లేకపోవడం వల్ల పాఠకుల సంఖ్య తగ్గుతుందన్నారు. ఈ సమస్యలను ఉన్నతాధికారుల దృష్టికి తీసుకువెళ్తానని ఈ సందర్భంగా కార్యదర్శి శంకరరావు చెప్పారు.

డీసీసీబీ చైర్మన్‌కు ఎమ్మెల్యే అభినందనలు

పాలకొండ, జూన్ 8 (ఆంధ్రజ్యోతి): విజయనగరంలో జిల్లా సహకార కేంద్ర బ్యాంకు (డీసీసీబీ) చైర్మన్‌గా కిమిడి నాగార్జున ఆదివారం ప్రమాణ స్వీకారం చేశారు. ఈ కార్యక్రమంలో పాలకొండ ఎమ్మెల్యే నిమ్మక జయకృష్ణ పాల్గొన్నారు. నాగార్జునకు పుష్పగుచ్ఛం అందించి అభినందనలు తెలిపారు.

దివ్యాంగులకు అండగా ప్రభుత్వం

బొబ్బిలి జూన్ 8 (ఆంధ్రజ్యోతి): దివ్యాంగులకు ప్రభుత్వం అండగా ఉంటుందని ఎమ్మెల్యే బేబీనాయన అన్నారు. పారా స్పోర్ట్స్‌కు సంబంధించిన చైతన్య యాత్ర బొబ్బిలి చేరుకున్న సందర్భంగా ఆదివారం స్థానిక మున్సిపల్ కార్యాలయంలో వాల్ పోస్టర్‌ను ఆయన విడుదల చేశారు. దివ్యాంగుల్లో క్రీడా ప్రతిభను గుర్తించి, వారు మరింత రాణించేలా ప్రభుత్వం ప్రోత్సాహం అందజేస్తుందని అన్నారు. రాష్ట్ర గ్రంథాలయ సంస్థ చైర్మన్ జి.కోటేశ్వరరావు, టీడీపీ దివ్యాంగుల విభాగం రాష్ట్ర కార్యదర్శి చీమల రాంబాబు తదితరులు పాల్గొన్నారు.

సీనియర్ సిటిజన్లతో యోగాంధ్ర

బొబ్బిలి రూరల్, జూన్ 8 (ఆంధ్రజ్యోతి): ప్రతిరోజూ యోగా చేయడం వల్ల ఆరోగ్యంగా ఉంటారని ఆర్డీవో జీవీఎస్ఎస్ రామ్మోహనరావు అన్నారు. బొబ్బిలి మండల పరిషత్ సమావేశ భవనంలో ఆదివారం సీనియర్ సిటిజన్లకు యోగా కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమాన్ని ఆర్డీవో ప్రారంభించారు. యోగా గురువు ఎం.ఈశ్వరవరప్రసాద్ ఆధ్వర్యంలో యోగాసనాలు వేశారు. డీడీవో ఎం.కిరణ్‌కుమార్, ఎంపీడీవో పి.రవికుమార్ తదితురులు పాల్గొన్నారు.

తైక్వాండో పోటీలకు ఎంపిక

బొబ్బిలి, జూన్ 8 (ఆంధ్రజ్యోతి): అనంతపురం జిల్లా తాడిపత్రిలో సోమవారం నుంచి మూడు రోజుల పాటు జరగనున్న రాష్ట్రస్థాయి తైక్వాండో పోటీలకు బొబ్బిలికి చెందిన క్రీడాకారులు ఎంపికైనట్లు తైక్వాండో కోచ్ బంకురు ప్రసాద్ తెలిపారు. జూనియర్స్ విభాగంలో గౌతమి, సంజన, సోమేశ్‌యాదవ్, శివరామకృష్ణ, సీనియర్స్ విభాగంలో అభినవ్, కిశోర్‌కుమార్, రోహిత్, కిరణ్‌లు ఎంపికైనట్లు చెప్పారు.

వెబ్ కౌన్సెలింగ్ సమంజసం కాదు: ఏపీటీఎఫ్

రామభద్రపురం, జూన్ 8(ఆంధ్రజ్యోతి): బదిలీలకు సంబంధించి ఎస్‌జీటీలకు మాన్యువల్ కౌన్సెలింగ్ కాకుండా వెబ్ కౌన్సెలింగ్ నిర్వహించడం సమంజసం కాదని ఏపీటీఎఫ్ రాష్ట్ర అకడమిక్ కన్వీనర్ జేసీ రాజు అన్నారు. రామభద్రపురంలో ఆదివారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ.. వెబ్ కౌన్సెలింగ్‌లో చోటు చేసుకున్న అసంబద్ధాలను విద్యాశాఖ తక్షణమే సరిచేయాలని కోరారు. ఈ సమావేశంలో ఏపీటీఎఫ్ నాయకులు బంకురు జోగినాయుడు, ప్రవీణ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

దిగజారుడు వ్యాఖ్యలు సరికాదు

- అమరావతి మహిళలకు క్షమాపణ చెప్పాలని టీడీపీ డిమాండ్
- పోలీస్ స్టేషన్లలో ఫిర్యాదు

పాలకొండ, జూన్ 8 (ఆంధ్రజ్యోతి): రాజధాని అమరావతి మహిళలను కించపరుస్తూ దిగజారుడు వ్యాఖ్యలు చేయడం సరికాదని పాలకొండ ఏఎంసీ డైరెక్టర్లు కొవ్వర సుబాషిణి, యామల రత్న కుమారి అన్నారు. సాక్షి టీవీలో దారుణంగా మాట్లాడిన జర్నలిస్టులపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఈ మేరకు ఆదివారం పాలకొండ పోలీస్‌స్టేషన్ హౌస్ ఆఫీసర్‌కు ఫిర్యాదు చేశారు. వైసీపీ ఉన్మాదులు తక్షణమే బుద్ధి మార్చుకుని, అమరావతి మహిళలకు క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. వారి వెంట టీడీపీ నాయకులు సింహాద్రి, రామినాయుడు, సూరీడమ్మ, జయమ్మ, ఆదిలక్ష్మి, సుశీలమ్మ, మంజుల తదితరులు పాల్గొన్నారు.

● తెలుగు మహిళల ఫిర్యాదు

పార్వతీపురం టౌన్, జూన్ 8 (ఆంధ్రజ్యోతి): అమరావతి మహిళలపై సాక్షి టీవీలో అసభ్యకరంగా మాట్లాడిన జర్నలిస్టులపై చర్యలు తీసుకోవాలని తెలుగు మహిళలు డిమాండ్ చేశారు. ఆదివారం పట్టణ పోలీసుస్టేషన్‌లో ఎస్ఐ జగదీష్ నాయుడుకు ఫిర్యాదు చేశారు. అనంతరం టీడీపీ పట్టణ అధ్యక్షుడు జి.రవికుమార్ మాట్లాడుతూ మహిళలపై ఏ మాత్రం గౌరవం లేని వారిని కఠినంగా శిక్షించాలన్నారు. వెంటనే వారు క్షమాపణ చెప్పాలని, లేదంటే ఉద్యమాలను ఉధృతం చేస్తామని హెచ్చరించారు.


పాలకొండ: స్టేషన్ హౌస్ ఆఫీసర్‌కు ఫిర్యాదు చేస్తున్న దృశ్యం


పార్వతీపురంలో ఫిర్యాదు పత్రం అందిస్తున్న తెలుగు మహిళలు, టీడీపీ నాయకులు

విజయనగరం కలెక్టరేట్ ఎదుట ఉపాధ్యాయుల ఆందోళన


కలెక్టరేట్ ఎదుట ఉపాధ్యాయుల నిరసన

విజయనగరం కలెక్టరేట్, జూన్8 (ఆంధ్రజ్యోతి): ఎస్‌జీటీలకు మాన్యువల్‌గా బదిలీలు నిర్వహించాని ఉపాధ్యాయులు కలెక్టరేట్ ఎదుట ఆదివారం ఆందోళన చేపట్టారు. న్యాయమైన సమస్య పరిష్కరించే వరకూ కదిలేది లేదన్నారు. ఉపాధ్యాయులు ఆదివారం డీఈవో కార్యాలయాన్ని ముట్టడించేందుకు వెళ్తుండగా కలెక్టరేట్ గేట్లు మూసేశారు. దీంతో కలెక్టరేట్ ప్రధాన గేటు వద్ద బైఠాయించారు. ప్రభుత్వం దిగివచ్చేవరకూ కౌన్సిలింగ్‌లో పాల్గొనేది లేదని హెచ్చరించారు. ఉపాధ్యాయులతో ఆడుకోవాలని చూస్తే గుణపాఠం చెబుతునామన్నారు. అనంతరం ఒంటి గంట సమయంలో కలెక్టరేట్ కూడలి లో రాస్తారోకో నిర్వహించారు. ఈ సందర్భంగా సంఘ నాయకులు మాట్లాడుతూ ఆన్‌లైన్‌లో బదిలీలు నిర్వహించడం వల్ల ఒక్కొక్క ఉపాధ్యాయుడు ఆన్‌లైన్‌లో ఆప్షన్ పెట్టుకోవాలంటే ఇబ్బంది పడాల్సి వస్తుందన్నారు. క్లస్టర్ లెవల్ అకడమిక్ టీచర్ ఖాళీలతో కలిసి ముందుగా ఇచ్చిన ఆప్షన్ మేరకు బదిలీ ఉత్తర్వులు విడుదల చేయాలన్నారు. చాలా మంది ఉపాధ్యాయులు రిక్వెస్ట్ బదిలీకి దరఖాస్తు చేసుకున్నప్పటికీ బదిలీల వైబ్ సైట్‌లో తప్పనరి బదిలీగా చూపడంతో ఆప్షన్ ఇచ్చుకోలేక పోయారన్నారు. తుది సీనియార్టీ జాబితాలను విడుదల చేయకుండా, ఉపాధ్యాయుల గ్రీవెన్స్ పరిష్కారం కాకుండా ఆప్షన్ పెట్టుకోవాలని ఒత్తిడి చేయడంతో చాలామంది నష్టపోయా రన్నారు. ఆందోళనలో ఉపాధ్యాయ సంఘ నాయకులు మురళీ మోహన్, కె.శ్రీనివాసరావు, జేఏవీఆర్ ఈశ్వరరావు, రమేష్‌చంద్రపట్నాయక్, రాము, విజయగౌరి, రవీంద్రనాయుడు, శ్రీనివాసరావు, బంకపల్లి శివప్రసాద్, శ్యామ్, జోగారావు, సూరిబాబు, ఈశ్వరరావు, పైడిరాజు, శ్రీనివాసరావు, నాగేశ్వరరావు, శ్రీనివాస్ తదితరులు ఉన్నారు.

అర్జీల స్థితి తెలుసుకునేందుకు టోల్‌ఫ్రీ నెంబర్

పార్వతీపురం, జూన్ 8 (ఆంధ్రజ్యోతి): ప్రజా సమస్యల పరిష్కార వేదిక (పీజీఆర్ఎస్)లో అందించే అర్జీల పరిస్థితి తెలుసుకునేందుకు ఇకపై ఫోన్ చేయొచ్చని కలెక్టర్ ఎ.శ్యామ్‌ప్రసాద్ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ముందుగా ప్రజలు మీకోసం.ఏపీ.జీవోవీ.ఇన్ వెబ్‌సైట్‌లో అర్జీలు నమోదు చేసుకోవాలన్నారు. ఆ తర్వాత అర్జీల నమోదు, వాటి స్థితి, ఇతరత్రా సమాచారం తెలుసుకోవడానికి టోల్ ఫ్రీ నెంబర్ 1100కు నేరుగా కాల్ చేయొచ్చని వెల్లడించారు. ఈ అవకాశాన్ని జిల్లా ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కలెక్టర్ సూచించారు.

నేడు సీతంపేట ఐటీడీఏలో పీజీఆర్ఎస్

సీతంపేట రూరల్, జూన్ 8 (ఆంధ్రజ్యోతి): సీతంపేట ఐటీడీఏ కార్యాలయంలో యథావిధిగా సోమవారం ప్రజా సమస్యల పరిష్కార వేదిక (పీజీఆర్ఎస్) నిర్వహించనున్నట్లు ఐటీడీఏ అధికారులు ఆదివారం ఓ ప్రకటనలో తెలిపారు. వివిధ సమస్యలు పరిష్కారం కోసం గిరిజనులు పీజీఆర్ఎస్‌ను ఆశ్రయించి అర్జీలు ఇవ్వొచ్చని పేర్కొన్నారు.

వైభవంగా అసిరితల్లి ఆలయ వార్షికోత్సవం


పూజలందుకున్న అసిరితల్లి

పాలకొండ, జూన్ 8 (ఆంధ్రజ్యోతి): వంతవాడ కాలనీలో అసిరితల్లి అమ్మవారి ఆలయం ప్రథమ వార్షికోత్సవాన్ని ఆదివారం ఘనంగా నిర్వహించారు. వేద పండితుడు బంకుపల్లి ప్రసాద్‌బాబు ఆధ్వర్యంలో అమ్మవారికి పంచామృతాభిషేకాలు ఆలంకరణ, విశేష అర్చన కార్యక్రమాలు జరిపారు. భక్తులతో సామూహిక కంకుమార్చనలు చేయించారు. అనంతరం నిర్వహించిన అన్నదాన కార్యక్రమంలో సుమారు వెయ్యి మంది పాల్గొన్నారు.

ఘనంగా అభయాంజనేయస్వామి విగ్రహ ప్రతిష్ఠ

మక్కువ, జూన్ 8 (ఆంధ్రజ్యోతి): డబ్బురువలసలో నిర్మించిన అభయాంజనేయస్వామి ఆలయంలో ఆదివారం విగ్రహ ప్రతిష్ఠ మహోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. వేద పండితుడు విజయ కుమార్‌శర్మ ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం సుమారు మూడు వేల మందికి అన్నదాన వితరణ కార్యక్రమం చేపట్టారు.





బందోబస్తుపై అధికారులకు సూచనలిస్తున్న ఎస్పీ మాధవరెడ్డి

మంత్రి లోకేశ్ పర్యటనకు సర్వం సిద్ధం

- నేడు జిల్లాకు రాక
- పార్వతీపురంలో విద్యార్థులతో ముఖాముఖి
- టెన్త్, ఇంటర్ ఫలితాల్లో మెరిసిన వారికి పురస్కారాల ప్రదానం
- చినబొండపల్లిలో క్లస్టర్, బూత్ ఇన్‌చార్జిలతో ప్రత్యేక సమావేశం
- ఏర్పాట్లు పూర్తి చేసిన అధికారులు



చినబొండపల్లిలో సిద్ధమైన సభా వేదిక

పార్వతీపురం, జూన్ 8(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర విద్యా శాఖ మంత్రి, టీడీపీ జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేశ్ సోమవారం జిల్లాకు రానున్నారు. జిల్లాకేంద్రం పార్వతీపురంలో పర్యటించనున్నారు. ఈ మేరకు అధికారులు అన్ని ఏర్పాట్లు పూర్తి చేశారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత తొలిసారిగా మంత్రి లోకేశ్ జిల్లాకు వస్తుండడంతో ఘన స్వాగతం పలికేందుకు శ్రేణులు సర్వం సిద్ధం చేశారు. పదో తరగతి ఫలితాల్లో జిల్లా మూడోసారి రాష్ట్రంలోనే ప్రథమ స్థానంలో నిలిచింది. ఈ ఏడాది ఇంటర్ ఫలితాల్లోనూ ముందంజలోనే ఉంది. ఈ నేపథ్యంలో పదో తరగతి, ఇంటర్ పరీక్ష ల్లో ఉత్తమ ఫలితాలు సాధించిన విద్యార్థులకు 'షైనింగ్ స్టార్స్' పేరిట మంత్రి పురస్కారాలు అందించనున్నారు. మన్యం జిల్లా నుంచే ఈ కార్యక్రమాన్ని ప్రారంభించనున్నారు. ఇందుకోసం పార్వతీపురంలోని రాయల్ కన్వెన్షన్ హాల్‌లో అన్ని ఏర్పాట్లు పూర్తి చేశారు. ఉదయం 11 నుంచి మధ్యాహ్నం 1.30 గంటల వరకు విద్యార్థులతో మంత్రి ముఖా ముఖి నిర్వహిస్తారు. ఆ తర్వాత పార్వతీపురం మండలం చినబొండపల్లిలో పార్టీ శ్రేణులతో సమా వేశం నిర్వహించనున్నారు. మధ్యాహ్నం 3 గంటల నుంచి రాత్రి ఏడు గంటల వరకు గ్రామ కమిటీలు, క్లస్టర్, బూత్ ఇన్‌చార్జిలు, కుటుంబ సాధికారిక స భ్యులతో మాట్లాడనున్నారు. క్షేత్రస్థాయిలో పార్టీ బలోపేతానికి తీసుకోవాల్సిన చర్యలు, ఏడాది పాలనలో సాధించిన ఫలితాలు, అభివృద్ధి కార్యక్ర మాలు, వాటిని ప్రజల్లోకి ఎలా తీసుకెళ్లాలి, భవిష్యత్ లో ఏ ఎన్నికలు జరిగినా.. ఎలా సమాయత్తం అవ్వా లనే దానిపై మంత్రి చర్చిస్తారని సమాచారం. సాధా రణ ఎన్నికల్లో కష్ట పడి పార్టీను ముందుకు నడి పించిన ముఖ్య కార్యకర్తలను లోకేశ్ చేతుల మీదుగా సత్కరించనున్నట్లు తెలిసింది. కార్యక్రమంలో జిల్లా ఇన్‌చార్జి మంత్రి అచ్చెన్నాయుడు పాల్గొనున్నారు.

ఘన స్వాగతానికి సన్నాహాలు..

సీతానగరం మండలం లచ్చయ్యపేట వద్ద మంత్రి లోకేశ్‌కు మంత్రి సంధ్యారాణి, ప్రభుత్వ విప్ తోయక జగదీశ్వరి, ఎమ్మెల్యేలు బోనెల విజయచంద్ర, నిమ్మక జయకృష్ణలు ఘన స్వాగతం పలక నున్నారు. జిల్లాలో 4 నియోజకవర్గాలకు చెందిన ముఖ్య నాయకులు, కార్యకర్తలు ఈ కార్యక్రమానికి పెద్ద ఎత్తున హాజరుకానున్నారు.

122 మంది 'షైనింగ్ స్టార్స్'

జిల్లాలో 122 మంది విద్యార్థులకు 'షైనింగ్ స్టార్స్' పేరిట మంత్రి లోకేశ్ పురస్కారాలతో పాటు నగదు కూడా అందించనున్నారు. టెన్త్‌లో 96 మంది, ఇంటర్‌లో 26 మంది విద్యార్థులున్నారు.



రాయల్ కన్వెన్షన్ హాల్‌లో పూర్తయిన ఏర్పాట్లు

ఇన్నోవేటివ్ హబ్‌కు శంకుస్థాపన

పార్వతీపురం పట్టణంలో నిర్మించనున్న ఇన్నోవేటివ్ హబ్‌కు మంత్రి నారా లోకేశ్ సోమవారం శంకుస్థాపన చేయనున్నారని కలెక్టర్ ఎ.శ్యామ్‌ప్రసాద్ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. షైనింగ్ స్టార్స్ కార్యక్రమం వద్ద శిలాఫలకాన్ని ఆవిష్కరిస్తారని వెల్లడించారు. నీతి ఆయోగ్ అందించిన రూ.3 కోట్లతో దానిని నిర్మించనున్నట్లు పేర్కొన్నారు.

భద్రతా ఏర్పాట్లను పరిశీలించిన ఎస్పీ

పార్వతీపురం/టౌన్: మంత్రి నారా లోకేశ్ జిల్లా పర్యటన నేపథ్యంలో భద్రతా ఏర్పాట్లను ఎస్పీ ఎస్‌వీ మాధవరెడ్డి పరిశీలించారు. 370 మంది పోలీసులతో పటిష్ఠ బందోబస్తు ఏర్పాటు చేసినట్లు తెలిపారు. వారిని ఎనిమిది సెక్టార్లుగా విభజించామన్నారు. ఏఎస్పీ అంకితసురాన పర్యవేక్షిస్తారని వెల్లడించారు. ఆయన వెంట పాలకొండ డీఎస్పీ రాంబాబు, ఏఆర్ డీఎస్పీ థామస్‌రెడ్డి తదితరులు ఉన్నారు.

టూర్ షెడ్యూల్ ఇదీ..

మంత్రి నారా లోకేశ్ సోమవారం ఉదయం 8.40 గంటలకు విశాఖ పట్నంలో బయలుదేరి రోడ్డు మార్గం ద్వారా పార్వతీపురం రాయల్ కన్వెన్షన్ హాల్‌కు చేరుకుంటారు. అక్కడ మధ్యాహ్నం 2.30 గంటల వరకు ఉంటారు. ఆ తర్వాత మధ్యాహ్నం 3 గంటలకు పార్వతీపురం మండలం చినబొండపల్లి సభా వేదిక వద్దకు చేరుకుంటారు. రాత్రి ఏడు గంటల వరకు పార్టీ శ్రేణులతో మంత్రి సమావేశం కానున్నారు. అనంతరం అక్కడ నుంచి బయలుదేరి రోడ్డు మార్గం గుండా విశాఖపట్నం పార్టీ ఆఫీస్‌కు చేరుకుంటారు. ఇదిలా ఉండగా పార్వతీపురంలో ప్రత్యామ్నాయంగా హెలీప్యాడ్‌ను కూడా సిద్ధం చేస్తున్నారు.

ఒక్కరోజే గడువు

- నేటితో ముగియనున్న ఉద్యోగ బదిలీల ప్రక్రియ



విజయనగరం కలెక్టరేట్, జూన్ 8 (ఆంధ్రజ్యోతి): ఉద్యోగుల సాధారణ బదిలీల ప్రక్రియ సోమవారంతో ముగియనుంది. అన్ని ప్రభుత్వ శాఖల్లో గత 25 రోజుల నుంచి బదిలీలు జరుగుతున్నాయి. దీంతో గ్రామస్థాయి నుంచి జిల్లాస్థాయి వరకూ పని చేసే పలువురు ఉద్యోగులు కొత్త స్థానాలకు మారారు. ఈనెల 2తోనే బదిలీల ప్రక్రియ పూర్తి కావల్సి ఉన్నా ప్రభుత్వం ఈ నెల 9 (సోమవారం) వరకు గడువు పెంచింది. కాగా, రెవెన్యూ, డీఆర్‌డీఏలో పని చేస్తున్న కొందరు ఉద్యోగులు బదిలీలపై గుర్రుమంటున్నారు. బదిలీల్లో నిబంధనలు పక్కన పెట్టారని అసహనం వ్యక్తం చేస్తున్నారు. జిల్లాలో డీఆర్‌డీఏలో 53మంది ఏపీఎంలు, 11 మంది డీపీఎంలు ఉన్నారు. అయితే, పోస్టుల సంఖ్యల తగ్గించడంతో జిల్లాలో 22 మంది ఏపీఎంలు, ఆరుగురు డీపీఎంలు అదనంగా ఉన్నారు. దీంతో వీరు ఈ నెల ఒకటో తేదీన విజయవాడలోని సెర్ప్ కార్యాలయంలో జరిగిన కౌన్సిలింగ్‌కు హాజరయ్యారు. వీరికి పోస్టులు ఎక్కడ కేటాస్తారు? అనేది తెలియాల్సి ఉంది. 16 మంది ఏపీఎంలలో ఇద్దరు అనకాపల్లి జిల్లాను, ఒకరు అల్లూరు సీతారామరాజు జిల్లాను, తొమ్మిది మంది కాకినాడ, మిగతా నలుగురు తూర్పు గోదావరి జిల్లాను కోరుకున్నారు. అయితే ఏపీఎంలను జోన్ పరిధిలో మాత్రమే బదిలీ చేయాలని జీవోలో పొందుపరిచినా, ఇప్పుడు జోన్ పరిధి దాటి బదిలీ చేయడంపై వారు ఆందోళన చెందుతున్నారు. దీంతో ఆ శాఖలో గందరగోళం నెలకొంది.

- రెవెన్యూ శాఖకు సంబంధించి ఎస్.కోట, నెల్లిమర్ల, రాజాం నియోజకవర్గాల్లో పని చేసిన ఉద్యోగులకు మాత్రమే బదిలీలు చేసినట్లు విమర్శలు వినిపిస్తున్నాయి. తమను ఎందుకు బదిలీ చేశారో? తెలియడం లేదని ఎస్.కోట నియోజకవర్గానికి చెందిన కొంతమంది వీఆర్వోలు గగ్గోలు పెడుతున్నారు. నెల్లిమర్ల నియోజకవర్గంలో కూడా ఇదే పరిస్థితి. కొందరు వీర్వోలను సొంత జిల్లాకు కాకుండా పక్క జిల్లా పార్వతీపురం మన్యంకు మార్చడంపై మదనపడుతున్నారు. కొందరు దరఖాస్తు చేసుకోకపోయినా? ఒకేచోట ఐదు సంవత్సరాల సర్వీసు పూర్తి కాకపోయినా వారిని బదిలీ చేయడంపై ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. పంచాయతీరాజ్ గ్రేడ్-1 నుంచి 4 వరకూ పని చేసే కార్యదర్శుల బదిలీల్లో సిఫారసులకు పెద్దపీట వేసినట్లు తెలుస్తోంది. ఏది ఏమైనా బదిలీలకు ఒక్కరోజే గడువు ఉండడంతో ఎంతమంది కొత్త స్థానాలకు వెళ్తారో చూడాలి.

ఏపీ ఈఏపీ సెట్‌లో మెరిశారు

- పాలకొండ విద్యార్థుల ప్రతిభ



రసజ్ఞ



కె.జశ్వంత్

పాలకొండ, జూన్ 8 (ఆంధ్రజ్యోతి): ఏపీ ఈఏపీ సెట్‌లో పాలకొండ విద్యార్థులు మెరిశారు. అత్యుత్తమ ర్యాంకులతో అదరగొట్టారు. పట్టణానికి చెందిన కె.రసజ్ఞ ఇంజనీరింగ్ విభాగంలో 24వ ర్యాంకు, మండలంలో సింగన్న వలసకు చెందిన కె.జశ్వంత్ ఫార్మసీ విభాగంలో 27వ ర్యాంకు సాధించారు. రాష్ట్ర స్థాయిలో విద్యార్థులు ఉత్తమ ర్యాంకులు సాధించడంపై కుటుంబ సభ్యులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. రసజ్ఞ తల్లి రమణమ్మ స్టాఫ్‌నర్స్‌గా విధులు నిర్వర్తిస్తున్నారు. తండ్రి శ్రీనివాస రావు చిరు వ్యాపారిగా ఉన్నారు. ఆ విద్యార్థిని గుడివాడ, విజయవాడలో టెన్త్, ఇంటర్ పూర్తి చేసింది. ఇటీవల విడుదల జేఈఈ అడ్వాన్స్‌డ్ ఫలితాల్లో రసజ్ఞ ఓపెన్ కేటగిరీలో 78వ ర్యాంకు సాధించింది. జేఈఈ మెయిన్స్‌లో 422 ర్యాంకు దక్కించుకుంది. జశ్వంత్ తల్లిదండ్రులు రాజీ, భాస్కరరావులు వ్యవసాయ రైతులుగా ఉన్నారు. ఆ విద్యార్థి విశాఖలో టెన్త్, ఇంటర్ పూర్తి చేశాడు.



పట్టణ పోలీసు స్టేషన్‌లో ఫిర్యాదు చేస్తున్న మంత్రి సంధ్యారాణి

అమరావతి మహిళలపై అనుచిత వ్యాఖ్యలు తగవు

- పోలీసులకు ఫిర్యాదు చేసిన మంత్రి సంధ్యారాణి

సాలూరు, జూన్8 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర రాజధాని అమరావతి మహిళలపై అనుచిత వ్యాఖ్యలు చేయడం సరికాదని మంత్రి గుమ్మిడి సంధ్యారాణి అన్నారు. ఆదివారం పట్టణ పోలీసు స్టేషన్‌కు వెళ్లి మాజీ సీఎం జగన్, సాక్షి మీడియాపై ఫిర్యాదు చేశారు. అనుచిత వ్యాఖ్యలు చేసిన వారిపై కఠిన చర్యలు తీసుకోవాలన్నారు. అనంతరం ఆమె విలేఖర్లతో మాట్లాడుతూ.. రాజధాని నిర్మాణం కోసం భూములు ఇచ్చిన అమరావతి మహిళలను కించపరుస్తూ మాట్లాడడం ఎంతవరకు సమంజసమన్నారు. ఆ వ్యాఖ్యలు చేసిన వారి కుటుంబంలో కూడా మహిళలు ఉన్నారన్న విషయాన్ని గుర్తించాలన్నారు. మీడియాలో ఆ విధంగా మాట్లాడడం క్షమించరాని నేరమని తెలిపారు. ఆమె వెంట కౌన్సిలర్లు వరలక్ష్మి, వైదేహి, రాజేశ్వరి, టీడీపీ పట్టణ అధ్యక్షుడు తిరుపతిరావు, ఏఎంసీ చైర్మన్ సూర్యనారాయణ తదితరులు ఉన్నారు.

లక్ష్మీపురంలో గజరాజులు

సీతానగరం, జూన్ 8 (ఆంధ్రజ్యోతి): సీతానగరం మండలంలోనే గజరాజులు హల్‌చల్ చేస్తున్నాయి. శుక్రవారం ఈ ప్రాంతంలోకి వచ్చిన ఏనుగులు పొలాల్లోని మోటారు పైపులు, మొక్కజొన్న బస్తాలను ధ్వంసం చేశాయి. శనివారం రాత్రి లక్ష్మీపురం పరిసరాల్లో సంచరించాయి. దీంతో స్థానికులు హడలెత్తిపోయారు. అవి ఎక్కడ గ్రామాల్లోకి వస్తాయోనని వారు కంటి మీద కునుకు లేకుండా గడిపారు. ఇళ్లలో ఉండలేక.. బయటకు రాలేక తీవ్ర ఇబ్బందులు పడారు. మరోవైపు అటవీశాఖ అధికారులు ఆ ప్రాంతానికి వచ్చి లక్ష్మీపురం పక్కనే ఉన్న సువర్ణముఖి నది వైపు గజరాజులను మళ్లించారు. దీంతో స్థానికులు ఊపిరిపీల్చుకున్నారు. అయితే అవి తిరిగి వచ్చే అవకాశం ఉండడంతో లక్ష్మీపురం, చెల్లంనాయుడువలస, యోగోటివలస, బుడ్డిపేట గ్రామాల ప్రజలు తీవ్ర భయాందోళన చెందుతున్నారు. ఇదిలా ఉండగా రాత్రి వేళల్లో ఒంటరిగా బయట తిరగరాదని అటవీశాఖ అధికారులు గ్రామస్థులను హెచ్చరిస్తున్నారు.